క్లుప్తంగా

పాఠశాలకు బీరువా విరాళం

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సోమవారం గ్రామానికే చెందిన మోరే కౌసల్య బీరువాను విరాళంగా అందించారు. కౌసల్య తన భర్త దేవురావు జ్ఞాపకార్థం రూ.9వేల విలువైన బీరువా అందించారు. ఉపాధ్యాయులు కౌసల్యను శాలువాతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు కొతిమీర రమేశ్, గణపతి తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

సోన్: మండలంలోని గంజాల్ గ్రామానికి చెందిన దర్శనం సురేశ్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006–07లో సురేశ్‌తో పదో తరగతి చదివిన తలో కొంత జమ చేసి రూ.50వేలను పోగు చేశారు. సోమవారం బాధిత కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు.

పాఠశాలలో చోరీ

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం అర్ధరాత్రి ట్యాబ్, రూ.వెయ్యి నగదును ఎత్తుకెళ్లినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. సోమవారం ఉదయం వచ్చేసరికి తరగతి గది తాళం పగులగొట్టి ఉండటంతో ఉపాధ్యాయులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పాఠశాల పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఒకరికి గాయాలు

నర్సాపూర్ (జి): ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలైన ఘటన నర్సాపూర్ (జి)లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం...నర్సాపూర్ (జి) మండలంలోని రాంపూర్‌కు చెందిన మీసాల నారాయణ సోమవారం ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కింద పడటంతో తలకు బలమైన గాయమైంది. బాధితుడిని కుటుంబ సభ్యులు 108 వాహనంలో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ తరలించనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

భైంసాటౌన్: పట్టణంలోని కుంటగల్లికి చెందిన అంజుబేగం అనే వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ సీఐ గోపినాథ్ తెలిపారు. సెప్టెంబర్ 25న నిజామాబాద్ జిల్లా ఎడపెల్లి హాస్టల్‌లో ఉంటున్న తన కూతురు వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. అదేరోజు మధ్యాహ్నం కుటుంబీకులు ఫోన్ చేయగా నిజామాబాద్ నుంచి బయలుదేరినట్లు చెప్పింది. మరోమారు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబీకులు గాలించినా ఫలితం లేకపోయింది. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వివాహిత తల్లి ఖాజాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్‌చైన్‌గేట్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు పతికే రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గౌరవ వేతనం అందజేసి క్వింటాలుకు రూ.300 కమీషన్ పెంచాలని, దిగుమతి హమాలీ ప్రభుత్వమే భరించాలని, డీలర్ చనిపోతే దహన సంస్కారాలకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పేకాటరాయుళ్లపై కేసు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ శివారులో సరస్వతీ కెనాల్ పక్కన పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే.గోపి తెలిపారు. న్యూవెల్మల్ గ్రామానికి చెందిన నలుగురు మూడు ముక్కల పేకాట ఆడుతుండగా సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.9,790 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని ఆవిష్కరిద్దాం

నిర్మల్‌టౌన్: హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని ఆవిష్కరించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ బస్టాండ్‌లో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సుఖవ్యాధులపై కళాజాత బృందం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జీవనం సాగించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. దసరా పండుగ వేడుకలకు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శూర్ స్వచ్ఛంద సంస్థ పీఎం మల్లికార్జున్, ఐటీసీ కౌన్సిలర్లు సుదర్శన్, శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



లోకేశ్వరం : రాజూరా ప్రాథమిక పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ముధోల్: మండల కేంద్రంలోని అక్షర పాఠశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. డైరెక్టర్ సుభాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు ఏఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమేశ్‌నాయక్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజలింగం తదితరులు ఉన్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని పలు పాఠశాలలతోపాటు సిర్గాపూర్ ఫ్లేర్ ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కరస్పాండెంట్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని పల్సిలో నచికేత పాఠశాలలో సోమవారం బతకమ్మ సంబరాలు నిర్వహించారు. అనంతరం సమీపంలో వాగులో బతుకమ్మలను నిమ్మజ్జనం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ గజ్జారాం, పోషకులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి సందడి చేశారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్, ఉపాధ్యాయులు సురేశ్, రాజేశ్వర్, పండరి, గణపతి తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని రాజూరలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, నాగభూషన్, మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, విద్యావలంటీర్లు పాల్గొన్నారు.



ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



భైంసారూరల్ : సంబరాల్లో విద్యార్థులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో సోమవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. బుధవారం నుంచి దసరా సెలవుల నేపథ్యంలో నిర్మల్‌లోని జేవీఎస్‌ఆర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయినులు బతుకమ్మ పేర్చి ఆడిపాడారు. హెచ్‌ఎం మణికుమారి తదితరులున్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని విజయసాయి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పంగెర స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ మురళి, పీఈటీ రాథోడ్ అరవింద్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కుంటాల: చుక్క ధర్మరాజు మెమోరియల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న నిర్మల్ తిరుమల గార్డెన్‌లో జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కుంటాల విజయసాయి పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొనగా నలుగురు బంగారు, ముగ్గురు వెండి, ఇద్దరు రజత పతకాలను సాధించారు. వీరికి కరాటే అసోసియేషన్ సభ్యులు తేజేందర్‌సింగ్, శ్రీకాంత్ సాయికృష్ణ, మృణాళిని, భూషణ్ ప్రశంసాపత్రాలు అందజేశారు. సోమవారం వీరిని ప్రిన్సిపాల్ పంగెర స్వప్న, కరాటే శిక్షకులు ఓ.గజేందర్, పీఈటీ అరవింద్ అభినందించారు.

కుభీర్:మండల కేంద్రంలోని చాణక్య సాంస్కృతిక పాఠశాలకు చెందిన 15మంది విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. 15 మంది బంగారు, వెండి, రజతం సాధించినట్లు కరస్పాండెంట్ సతీశ్, ప్రిన్సిపాల్ పి.నరేశ్ తెలిపారు.

సోన్: జాతీయస్థాయి కరాటే పోటీల్లో సోన్‌లోని అభ్యాస గురుకులం విద్యార్థులు సత్తా చాటారని ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్‌కుమార్ తెలిపారు. గుమ్ముల శైలజ, అరెపల్లి వర్షిని, ఇందూరి సంజయ్, బంగారు.. రిత్విక్, ఒడ్డేమ్ ప్రణవి, మాడయ్ ఆదిత్య, యెద్దడి నైతిక్ వెండి, లోలం సాయిరిత్విక్, గుమ్ముల హర్షిత్, సహజ, శెట్‌పల్లి చైత్ర, శ్రీనిధి, కాంతి తనీశ్, పెసరి మోక్షిత్ కాంస్యం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, పోషకులు, తోటి విద్యార్థులు అభినందించారు.



కడెం: లింగాపూర్‌లో అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తానూరు: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని వాగ్దేవి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎం.తేజస్విని బంగారు, బి.లౌక్య, హెచ్.ఆరుషి కాంస్యం అందుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌రెడ్డి, ఎస్సై రమేశ్ సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు అవినాశ్ తదితరులు ఉన్నారు.

కడెం: జాతీయస్థాయి పోటీల్లో మండలంలోని లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శ్రీజ, ఝాన్సీ, కావ్య, శ్రీ మేఘన, హరిప్రియ బంగారు, అభిజ్ఞ, సాహితీ, ప్రత్యూష వెండి, రక్షిత, వేద, శ్రీరాజా, శ్రీహరిణి రజత పతకాలు సాధించారు. వీరిని సోమవారం హెచ్‌ఎం బి.వెంకటరమణ తదితరులు అభినందించారు.

ఖానాపూర్: పట్టణంలోని ఏఆర్‌ఎస్ కళాశాల విద్యార్థిని మానస జూనియర్ కటా విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు కరాటే మాస్టర్లు సురేశ్, కిషన్, నాగలక్ష్మి, ఆరిఫ్ తెలిపారు. విద్యార్థినికి టోర్నమెంట్ చీఫ్ జడ్జి సుదర్శన్ చేతులమీదుగా రజతం అందజేశారు.

సమతుల ఆహారంతోనే గుండె భద్రం

భైంసాటౌన్: సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా గుండెజబ్బులకు దూరం ఉండవచ్చని భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్ అన్నారు. సోమవారం ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా స్థానిక గురుకృప ఒకేషనల్ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ తీశారు. ఈసందర్భంగా జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు ఫిర్దోస్ జబీన్, హెచ్‌ఈఓ కలీం, హెల్త్ అసిస్టెంట్ నరేశ్, కళాశాల డైరెక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్, ప్రిన్సిపాల్ సాయినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ కాశీనాథ్

ప్రైవేట్ ఆస్పత్రులపై విచారణ చేయాలి

ఖానాపూర్: పట్టణంలో అనుమతుల్లేకుండా నడుస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కారికారి రాజేశ్, ఆ పార్టీ నాయకులు అభిషేక్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలో డీఎంహెచ్‌వో రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విచారణ చేసి కేసులు నమోదు చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీ సభ్యత్వ నమోదు

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, ప్రధాన కార్యదర్శి కొండవేని రమేశ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సందుపట్ల శ్రావణ్, సంతోష్, శ్రీనివాస్, ముత్యపు రాధ ఉన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక

ఖానాపూర్: జిల్లాకేంద్రంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జెడ్పీ హెచ్‌ఎస్ బాలికల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం సంధ్యారాణి, గైడ్ టీచర్ సుజాత తెలిపారు. అథ్లెటిక్స్ అండర్–14 విభాగంలో దివ్య(ఎనిమిదో తరగతి).. అండర్–17లో డి.సనా(తొమ్మిదో తరగతి), వాలీబాల్ పోటీల్లో అండర్–17 విభాగంలో సీహెచ్ సంజన జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు.

ఎంఈఓపై ఫిర్యాదు

సారంగపూర్: మండలంలోని చించోలి(బి)కి చెందిన కొంతం కృష్ణవేణి సోమవారం తహసీల్దార్ కార్యాలంయలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఎంఈఓ మధుసూదన్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల మండలంలోని కేజీబీవీలో అటెండర్, సహాయక వంటమనిషి పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆగష్టు 21న నోటిఫికేషన్ జారీ చేసి.. అదే నెల 31వరకు దరఖాస్తులు స్వీకరించారు. సెప్టెంబర్ ఎనిమిదో తేదీ వరకు దరఖాస్తుదారుల జాబితా ప్రదర్శన అనంతరం ఉద్యోగుల ఎంపికపై అభ్యంతరాలను స్వీకరించి 9న అర్హుల జాబితా ప్రకటించాల్సి ఉండగా నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు ప్రతిని కలెక్టర్, ఆర్డీవోకు అందించినట్లు తెలిపారు.

గీత కార్మికులకు అవగాహన

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్‌పై అవగాహన కల్పించారు. గీత కార్మికులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోకుండా శిక్షకులు జశ్వంత్, అంజాగౌడ్, వెంకట్‌రాజం, వెంకన్న, శ్రీనివాస్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌రావు, ఎస్సై అభిశేఖర్, సిబ్బంది వెంకటేశ్, హరీశ్, ఇర్ఫాన్, ముత్యం, నరేశ్, భాస్కర్, కల్పన, రవళి, గౌడ కులస్తులు గుగ్గిళ్ల సంతోష్‌గౌడ్, చెక్కిళ్ల రాజేశ్వర్ గౌడ్, జలేందర్‌గౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

సోన్: మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో సోమవారం విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సంస్థ ప్రతినిధులు శరత్‌కుమార్, హారిక మాట్లాడారు. బాల్యవివాహాల సమాచారం తెలిస్తే.. 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం బాల్యవివాహాలపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

డిక్షనరీలు అందజేత

నిర్మల్‌రూరల్: మండలంలోని వెంగ్వపేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు రూ.ఆరు వేల విలువైన డిక్షనరీలను అదే గ్రామానికి చెందిన విశ్రాంత అటవీ అధికారి జి.రాజేశ్వర్ అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యు.గజ్జారాం, తొడిశెట్టి శంకర్, వీడీసీ సభ్యులు చిన్నయ్య, భూమయ్య, గంగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఖానాపూర్: ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా సోమవారం మండలంలోని తర్లపాడ్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భైంసారూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల హెచ్‌ఎం ముత్యంరెడ్డి అన్నారు. స్వచ్ఛతహీ సేవాలో భాగంగా సోమవారం మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాలలో పరిసరాలను శుభ్రపరిచారు. అనంరతం విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యదర్శి అనిత, ఉపాధ్యాయులు కృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా అన్న సంతర్పణ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో పురాతన అన్నపూర్ణ మహా దేవాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే అన్నసంతర్పణ కార్యక్రమం భక్తులు విజయవంతం చేయాలని ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం అర్చకులు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు.

పాఠశాలలు తనిఖీ చేసిన ఎంఈవో

తానూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో నరేందర్ సూచించారు. సోమవారం మండలంలోని మహలింగి, బామ్ని, భోసి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి.. కొనసాగుతున్న నాస్ పరీక్షలను పరిశీలించారు. సీఆర్పీ గంగాధర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వయోవృద్ధుల దినోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ సరళాదేవి, నాయకులు జన్నారపు శంకర్, మ్యాదరి రాజేశ్వర్ కుటుంబ విలువలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

జోనల్‌స్థాయి పోటీలకు కడెం విద్యార్థి

కడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి సయ్యద్ ఫర్హాన్ అండర్–14 బాలుర విభాగంలో జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్‌రెడ్డి, పీడీ బోయిని వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం నిర్మల్ ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జోనల్‌స్థాయికి ఎంపికయ్యారు.

సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: జిలా వైద్య ఆరోగ్యశాఖలో డీపీఎంవోగా విధులు నిర్వహించిన వినోద్‌కుమార్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినోద్‌కుమార్‌కు సన్మానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన సతీమణి విజయలక్ష్మి మరణానంతరం మెడికల్ కళాశాలకు వారి భౌతికదేహాలను అప్పగించేందుకు అంగీకరిస్తూ డీఎంహెచ్‌వో రాజేందర్ అంగీకార పత్రం అందజేశారు. పీవోలు డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, నైనారెడ్డి, డాక్టర్ సౌమ్య, జిల్లా మాస్ మీడియా అధికారి రవీందర్, కేఎస్ గౌడ్, సంతోష్, వేణుగోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈకి సన్మానం

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ ఇంజినీర్‌గా పని చేస్తున్న జాదవ్ సంతోష్ భైంసా మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ సీవీఎస్ రాజు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇందులో పలువురు కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతుల హామీలు అమలు చేయాలి

- ఎమ్మెల్యే రామారావు పటేల్
- ఇందిరాపార్కు దీక్షకు తరలిన బీజేపీ నాయకులు



దీక్షకు మద్దతు తెలుపుతున్న జిల్లా నాయకులు

భైంసాటౌన్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ రైతులకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చాలని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు హామీల సాధన దీక్షలో పాల్గొని మాట్లాడారు. ధర్నాకు పట్టణం నుంచి పట్టణాధ్యక్షుడు మల్లేశ్, కౌన్సిలర్ దశరథ్, దిలీప్, లింగురాం, గాలి రాజన్న తదితరులు వెళ్లారు.

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన రైతు హామీల సాధన దీక్షకు మద్దతుగా జిల్లా నాయకులు పాల్గొన్నారు. రావుల రాంనాథ్, భూపతిరెడ్డి, గణేశ్, నారాయణరెడ్డి, తోకల అనిల్, ఠాగూర్ అర్జున్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: దీక్షకు మండలంలోని బీజేపీ నాయకులు తరలివెళ్లారు. భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేశ్, సురకంటి ముత్యంరెడ్డి, రాజేశ్వర్, దశగౌడ్, పడిగెల సురేశ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: రైతు హామీల సాధన దీక్షలకు మండలంలోని బీజేపీ నాయకులు ఎమ్మెల్యే రామారావును కలిసి మద్దతు పలికారు. బీజేపీ మండల కన్వీనర్ జయసాగర్‌రావు, మేకల రమేశ్, జీవన్, మంద భాస్కర్, సందీప్, సాయన్న ఉన్నారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని దీక్ష



దీక్షకు మద్దతు తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌టౌన్: స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్ యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నవ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో బీసీల సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. దీనికి నవ సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు జైహింద్ గౌడ్, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ హాజరై మద్దతు పలికారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వెంటనే కులగణన చేపట్టి.. స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అసెంబ్లీ పార్లమెంట్‌లోనూ సముచిత స్థానం కల్పించాలని.. బీసీలంతా ఏకం అవుదామని పిలుపునిచ్చారు. న్యాయవాది మల్లారెడ్డి, నవ సంఘర్షణ సమితి నాయకులు నవీన్‌కుమార్, మహేశ్‌గౌడ్, గంగిరెడ్డి నర్సారెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



కుభీర్: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కుభీర్: ఉట్నూర్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మండల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఖోఖో పోటీల్లో మండల కేంద్రంలోని డోడర్నా ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన పి.సంజయ్, చెస్ పోటీల్లో రాహుల్ ఎంపికయ్యారు. వారిని సోమవారం ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, సిబ్బంది అభినందించారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం గఫార్, పీఈటీ సరిత తెలిపారు. ఇటీవల నిర్మల్‌లో జరిగిన డివిజన్ స్థాయి ట్రైబల్ వెల్ఫేర్ ఆటల పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వాలీబాల్ పోటీల్లో అండర్–17 విభాగంలో పదోతరగతి విద్యార్థి శివ, చెస్‌లో అండర్–14 విభాగంలో ఏడో తరగతి విద్యార్థి భీంరావు ఎంపికయ్యారని, నవంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు.

పోషకాహారంపై అవగాహన



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ



భైంసాలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ రాజశ్రీ

సోన్: పోషణమాసం చివరిరోజు సందర్భంగా మండలంలోని కూచన్‌పెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. టీచర్లు, వెంకటేశ్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి విశారద ఆధ్వర్యంలో ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఎంపీడీవో పుష్పలత, ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవనీత్‌కుమార్, టీచర్లు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పోషణ్ అభియాన్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఇన్‌చార్జి సీడీపీఓ రాజశ్రీ అన్నారు. పట్టణంలోని నర్సింహ కల్యాణ మండపంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. డాక్టర్ ఫిర్దోస్ జబీన్, కమలేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఎంపీడీవో రాధ తహసీల్దార్ జానకితో కలిసి అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం వివిధ గ్రామాల గర్భిణులకు సీమంతాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రత్యూష, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

'వాటర్ ప్లాంట్ పనులు నిలిపేయాలి'

పెంబి: మండలంలోని ఇటిక్యాలలో అక్రమంగా నిర్మిస్తున్న వాటర్‌ప్లాంట్ పనులు నిలిపివేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ లచ్చిరాం, ఎంపీడీవో కార్యాలయలంలో ఎంపీడీవో రమాకాంత్‌కు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూపంచాయతీ అనుమతుల్లేకుండా వాటర్ ప్లాంట్‌కు మొరం తరలిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్లాంట్ నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరారు. మాజీ సర్పంచ్ మహేందర్, ఉపసర్పంచ్ సమీ, గ్రామస్తులు ఎల్లయ్య, షబ్బీర్, గోవింద్ తదితరులు ఉన్నారు.

అడెల్లి జాతర ఏర్పాట్లపై సమీక్ష

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయం గంగనీళ్ల జాతర ఈనెల 5, 6వతేదీల్లో నిర్వహించనుండగా ఏర్పాట్లపై అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం వద్ద బందోబస్తు విషయమై ఈఓ రమేశ్.. ఎస్సై శ్రీకాంత్‌తో చర్చించారు. ఆర్టీసీ డీఎంలతో ఫోన్‌లో మాట్లాడి భైంసా, నిర్మల్ డిపోల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం అమ్మవారి నగలు గోదావరి నదికి తరలించే మార్గంలో రోడ్లను శుభ్రం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అడెల్లి గ్రామ ప్రజలు, అర్చకులు తదితరులు ఉన్నారు.

నిర్వహణ భక్తులకు అప్పగించాలి

నిర్మల్‌టౌన్: పీఠాధిపతులు, స్వామీజీలు, ధార్మిక, సామాజిక పెద్దల నేతృత్వంలో ఉన్న దేవాలయాల నిర్వహణను భక్తులకు అప్పగించాలని జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఇందూర్ విభాగ్ ధర్మచార్య సంపర్క్ ప్రముఖ్ పతికే రాజేందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట హిందూ దేవాలయాల హక్కులపై నిరసన చేపట్టారు. అన్యక్రాంతమైన ఆలయాల భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. దేవాలయ–ధర్మాదయ శాఖను రద్దు చేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్, నూకల విజయ్‌కుమార్, అయ్యన్నగారి భూమయ్య, అమెడ శ్రీధర్, రమేశ్, రాజేశ్వర్, సాగర్ పాల్గొన్నారు.

అవగాహన

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో సోమవారం ఆర్టీసీ సిబ్బంది గమ్యం యాప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం దివ్యాంగులకు 50 శాతం రాయితీ బస్‌పాస్‌లు అందజేశారు. ఆర్టీసీ అధికారులు రమణ, సాయారెడ్డి, రమేశ్‌రెడ్డి తదితరులున్నారు.